## క్లుప్తంగా

### అరుణాచలంలో శివుడికి ఎమ్మెల్యే పూజలు



నర్సంపేట : తమిళనాడులోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన అరుణాచలంలో శివుడికి స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఆదివారం కుటుంబ సమేతంగా పూజలు నిర్వహించారు. తొలుత అరుణాచలంలో గిరిప్రదక్షిణ చేశారు. అనంతరం ఆలయంలో శివుడికి సతీమణి శాలిని, కూతురు అనన్యతో కలిసి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

### బాల సంస్కార్-2025 తరగతులు ప్రారంభం



పర్వతగిరి : మండలంలోని కల్లెడలోని శ్రీ ప్రసన్న కొలను వేంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలో 4 నుంచి పదో తరగతి వరకు చదువుతున్న బాలలకు బాల సంస్కార్-2025 పేరుతో తలపెట్టిన శిక్షణ తరగతులను శ్రీరామకృష్ణ సేవా సమితి, సహృదయ సేవా సమితి, కల్లెడ స్వయం సేవిక బాధ్యులు ఆదివారం ప్రారంభించారు. విద్యార్థులకు యోగా, ధ్యానం, నైతిక విలువలు పెంచే కథలు, పద్యాలు, ప్రేరణాత్మక కథలు, కవితలు, ఆటలు, తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

### ఆటో యూనియన్ కార్యవర్గం ఎన్నిక



సంగెం : మండల కేంద్రంలోని సంఘమేశ్వర ఆటో యూనియన్ కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మెట్టుపల్లి బాబు, ఉపాధ్యక్షుడిగా నీరటి నాగరాజు, కార్యదర్శిగా నంగునూరి కుమార్, కోశాధికారిగా గుండేటి పరమేశ్, ఆర్గనైజర్లుగా గుండేటి కరుణాకర్, రాయపురం సారంగం, ముఖ్య సలహాదారులుగా గుండేటి కోర్నెల్, అజహరుద్దీన్, గుండేటి కిరణ్, తిరుపతి, నీరటి కుమార్, చిర్ర రాజబాబు, చంద్రశేఖర్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు బాబు, కార్యదర్శి కుమార్ మాట్లాడారు. ఆటోడ్రైవర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

### రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

వర్ధన్నపేట : బైక్‌ను ట్రాక్టర్ ఢీకొన్న ఘటనలో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన పట్టణ పరిధిలోని భావనికుంట తండాలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. వివరాలిలా.. పట్టణ పరిధిలోని నీలగిరిస్వామి తండాకు చెందిన బానోతు రమణ భావనికుంట తండాకు వెళ్లి భార్యను తీసుకుని ద్విచక్ర వాహనంపై నీలగిరిస్వామి తండాకు వస్తుండగా దుర్గమ్మ ఆలయ సమీపంలో ఎదురుగా అతి వేగంగా వచ్చిన ట్రాక్టర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రమణ కాలు విరిగి తీవ్ర గాయాలయ్యాయి. ఆయన సతమణికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు రమణను వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమిస్తుండడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లి చేర్చారు. రమణ పరిస్థితి విషమంగా ఉందని తెలిసింది.

### విషాదం

వర్ధన్నపేట : పట్టణానికి చెందిన ఓర్సు మల్లేశ్ మృతితో స్థానికంగా విషాదం నెలకొంది. మండలంలోని కొండూరులో మట్టి పని తవ్వకానికి వచ్చిన ఆయన అస్వస్థతకు గురి కాగా స్థానిక ఆర్ఎంపీ వద్ద ఇంజక్షన్ అనంతరం మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో బాధిత కుటుంబం ఆందోళన చేపట్టింది. పోలీసులు విచారణ చేపట్టారు. కాగా పేద కుటుంబానికి చెందిన మల్లేశ్ మృతితో బాధిత కుటుంబీకులు కన్నీరు మున్నీరయ్యారు. మృతుడి భార్య, ఇద్దరు పిల్లలు అనాథలయ్యారంటూ స్థానికులు కంటతడి పెట్టారు. మల్లేశ్ మృతిపై సమగ్ర విచారణ చేపట్టి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని స్థానికులు కోరుతున్నారు.

### వృద్ధురాలి అదృశ్యం

ఖిలా వరంగల్ : ఎస్ఆర్ఆర్‌తోట ప్రాంతానికి చెందిన రాధారపు కేతమ్మ అదృశ్యమైనట్టు ఇన్‌స్పెక్టర్ వెంకటరత్నం తెలిపారు. ఆమె ఈనెల 24న తన ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లి తిరిగి రాకపోవడంతో బంధువుల, తెలిసిన వారి వద్ద వెతికినా ఆచూకీ లభించలేదని ఆమె కుమార్తె టేకుమట్ల కొమురమ్మకు ఫిర్యాదులో పేర్కొంది. కొమురమ్మ ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్టు ఇన్‌స్పెక్టర్ వెంకటరత్నం తెలిపారు. ఎవరికైనా ఆచూకీ తెలిస్తే సమాచారం అందించాలని కోరారు.

# కూరగాయల సాగు లాభదాయకం

● జిల్లా ఉద్యాన శాఖ అధికారి సంగీతలక్ష్మి



దుగ్గొండి : వేసవి నేపథ్యంలో పంట ఉత్పత్తులకు గిట్టుబాటు ధర లేకపోవడం, భూసారం తగ్గి దిగుబడులు గణనీయంగా పడిపోయి రైతులు ఆర్థికంగా చితికిపోతున్నారు. ఈ క్రమంలో మార్కెట్లో డిమాండ్‌కు తగ్గట్టు వ్యవసాయానికి అనుబంధంగా కూరగాయ పంటల సాగుతో అధిక లాభాలు సాధించవచ్చని జిల్లా ఉద్యాన శాఖ అధికారి సంగీతలక్ష్మి తెలిపారు. పంట వేసే సమయం పట్ల జాగ్రత్తలు తీసుకోతే నష్టాలు ఖాయమని ఆమె స్పష్టం చేశారు. పంట సమయం, సాగు విధానం, మార్కెట్‌లో డిమాండ్‌ను బట్టి ఆయా కూరగాయల, ఆకుకూరల ఎంపిక విషయాల్లో అవగాహనతో వ్యవహరించాలని ఆమె సూచించారు.

**చిక్కుడు..**

తీగ చిక్కుడు, చెట్టు చిక్కుడును రైతులు సాధారణంగా జూన్, జులై నెలల్లో సాగు చేయడం ఆనవాయితీగా వస్తోంది. రైతులందరూ ఒకే సమయంలో సాగు చేస్తే పంట ఉత్పత్తులు మార్కెట్‌ను ముంచెత్తుతాయి. ఫలితంగా ధరలు తగ్గిపోతాయి. చిక్కుడుకాయ తెంపిన కూలీలకు కూడా ఆదాయం సరిపోని దుస్థితి నెలకొనే ప్రమాదం ఉంది.

**మే 15లోపు సాగు లాభం**

రైతులు చిక్కుడును మే 15లోగా సాగు చేయాలి. చిక్కుడు విత్తనాలు నాటి తీగలు పాకడానికి కర్రలను ఊతంగా పాతాలి. కర్రలకు మెష్ తీగలు అల్లాలి. తద్వారా జూన్ మొదటి వారానికల్లా కాయలు కోతకొస్తాయి. జులై, అగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో డిమాండ్ ఎక్కువగా ఉంటుంది. గిట్టుబాటు ధర పలుకుతుంది. ఎకరాకు రూ.1.50 లక్షల ఆదాయం పొందే అవకాశం ఉంది.



రైతు సాగు చేస్తున్న బీర తోట

**మే 15 నుంచి బీర సాగు..**

తాత్కాలిక పందిళ్లు వేసి బీర సాగు చేపట్టాలి. మార్కెట్‌లో అనేక రకాల హైబ్రిడ్ విత్తనాలు అందుబాటులో ఉన్నాయి. కర్రలతో తాత్కాలిక పందిళ్లు ఏర్పాటు చేసి లేదా ఉపాధి హామీ పథకం కింద శాశ్వత ప్రాతిపదికన పందిళ్లు ఏర్పాటు చేసుకుని సాగు చేయాలి. జూన్ 20 కల్లా దిగుబడి మొదలవుతుంది. ఆ సమయంలో మార్కెట్‌లో బీరకు మెరుగైన ధర పలుకుతుంది. బీర ఆలస్యంగా సాగు చేస్తే మార్కెట్లోకి సరుకు ఎక్కువగా చేరి ధర పడిపోయే ప్రమాదం ఉంది.

**టమాట..**

వేసవిలో టమాట సాగు లాభదాయమన్నది జగమెరిగిన సత్యం. ఆసక్తి ఉన్న రైతులు తాత్కాలిక షేడ్ నెట్ ఏర్పాటు చేసుకుని మే, జూన్ నెలల్లో నాటాలి. మే, జూన్, జులై నెలల్లో పంట చేతికొచ్చి మంచి ధర పలుకుంది. నవంబర్, డిసెంబర్, జనవరి వరకు లాభాలు ఆర్జించవచ్చు. తదనంతరం ఫిబ్రవరి, మార్చి నెలల్లో ధర తగ్గే అవకాశం ఉంది. షేడ్ నెట్ వేసి గుంజలు పాతిపైన తీగ కట్టి తీగకు టమాట తీగలను దారంతో నేలకు ఆనకుండా కట్టాలి. తద్వారా కాసిన కాయలన్నీ చేతికి అందుతాయి. కుళ్లిపోకుండా, తెగుళ్ల సోకకుండా నాణ్యతతో పంట లభిస్తుంది.



పాలకూర తోట

**షేడ్ నెట్ నీడన పచ్చిమిర్చి, ఆకుకూరలు..**

రైతులు కొద్దిపాటి భూమిలో తాత్కాలిక షేడ్ నెట్ ఏర్పాటు చేసుకుని మే నెలలో పచ్చిమిర్చి సాగు చేయాలి. అలా చేస్తే జూన్, జులై నెలల్లో మిర్చి పంట చేతికొస్తుంది. మార్కెట్లో సరైన ధర లభిస్తుంది. జూన్ నుంచి అక్టోబర్ వరకు మంచి ధరలు ఉంటాయి. మార్కెట్‌లో పలు రకాల హైబ్రిడ్ విత్తనాలు అందుబాటులో ఉన్నాయి. విత్తనం ఏదైనా షేడ్ నెట్ కింద సాగు లాభదాయకమే.

**ఆకుకూరలు...**

వేసవిలో ఆకుకూరలు దొరకడం కష్టం. ఇలాంటి సమయంలోనే మార్కెట్లో ఉన్న డిమాండ్‌కు అనుగుణంగా ఆకుకూరలు అందుబాటులోకి వచ్చేలా జాగ్రత్తలు తీసుకోవాలి. సమయానికి అనుగుణంగా ఆకుకూరలు సాగు చేయాలి. మే, జూన్ నెలల్లో ఎండల తీవ్రత నేపథ్యంలో షేడ్ నెట్ ఏర్పాటు చేసి దాని కింద కొత్తిమీర, పాలకూర, చుక్కకూర, తోటకూర సాగు చేయొచ్చు. కేవలం 30 రోజుల వ్యవధిలోనే అవి చేతికి అందుతాయి. సరైన ధర, లాభాలు ఖాయం. సమయానుగుణంగా కూరగాయల పంటలు సాగు చేస్తే ఎకరం భూమిలో వచ్చే ఆదాయాన్ని 10 గుంటల్లో సాధించొచ్చు. రైతులు డిమాండ్‌ను బట్టి పంటలు సాగు పనులు చేపట్టాలి.

# బీఆర్ఎస్ ఆవిర్భావ వేడుకలు



నర్సంపేట : జెండా ఎగరేస్తున్న పట్టణ అధ్యక్షుడు వెంకటనారాయణ

సాక్షి నెట్‌వర్క్ : నర్సంపేట, పర్వతగిరి, దుగ్గొండి, ఖానాపురం, తదితర మండలాల్లో ఆదివారం బీఆర్ఎస్ ఆవిర్భావ వేడుకలు నిర్వహించారు. నర్సంపేటలో రాష్ట్ర నాయకుడు రాయిడి రవీందర్ రెడ్డి, జిల్లా నాయకుడు నల్ల మనోహర్‌రెడ్డితో కలిసి పట్టణ అధ్యక్షుడు నాగెల్లి వెంకటనారాయణ జెండా ఆవిష్కరించారు. ఖానాపురంలో మాజీ ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు, దుగ్గొండిలో మండల అధ్యక్షుడు సుకినే రాజేశ్వర్‌రావు జెండా ఎగరేశారు.



ఖానాపురం : జెండా ఆవిష్కరిస్తున్న ప్రకాశ్‌రావు

తొలుత నాయకులు, కార్యకర్తలు తెలంగాణ అమర వీరులకు ఘనంగా నివాళులర్పించారు.

# సహజ పానీయాలు ఆరోగ్యానికి మేలు

● జేవీవీ జిల్లా అధ్యక్షుడు ఇంద్రసేనారెడ్డి

నర్సంపేట : ఎండాకాలంలో సహజ పానీయాలతో ఆరోగ్యానికి మేలు జరుగుతుందని జన విజ్ఞాన వేదిక (జేవీవీ) జిల్లా అధ్యక్షుడు మోతె ఇంద్రసేనా రెడ్డి, గౌరవ అధ్యక్షుడు డాక్టర్ జయుడు తెలిపారు. పట్టణంలో వేదిక వరంగల్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని ఆదివారం వారు ప్రారంభించి మాట్లాడారు. ఎండల తీవ్రత నేపథ్యంలో ప్రజలు ఉపశమనం కోసం మజ్జిగ, కొబ్బరి నీళ్లు, నిమ్మకాయ రసం, రాగి మాల్ట్, తదితర పానీయాలు సేవించాలని కోరారు. కూల్‌డ్రింక్‌ల్లో క్రిమిసంహారక మందులు ఉంటాయని సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ అనే సంస్థ నిర్ధారించిందని తెలిపారు. వేదిక ప్రధాన కార్యదర్శి సుధాకర్ మాట్లాడుతూ కూల్‌డ్రింక్‌ల్లో ఉండే ఫ్రక్టోస్‌తో అధిక రక్తపోటు, మధు



మజ్జిగ పంపిణీని ప్రారంభిస్తున్న ఇంద్రసేనారెడ్డి

మేహం వచ్చే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో చెకుముకి కన్వీనర్ రాయబోస్, గౌరవ అధ్యక్షుడు పెండెం భాస్కర్, ఉపాధ్యక్షుడు సాగర్, మండల ప్రధాన కార్యదర్శి నవీన్, లీడ్ లైబ్రరీ వ్యవస్థాపకుడు రవికుమార్, ప్రముఖ ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ భరత్, సారంగపాణి, హెడ్ కానిస్టేబుల్ వీరన్న, కిరణ్, వేదిక జిల్లా సాంస్కృతిక విభాగం కన్వీనర్ యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

# మాజీ ఎమ్మెల్యే ఓంకార్ సేవలు మరువలేనివి

● ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కార్యదర్శి రమేశ్

దుగ్గొండి : నర్సంపేట నియోజకవర్గ ప్రజలకు మాజీ ఎమ్మెల్యే మద్దికాయల ఓంకార్ అందించిన సేవలు మరువలేనివని ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేశ్ తెలిపారు. ఓంకార్ శత జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరుతూ ముద్రించిన కరపత్రాలను మండలంలోని రేబల్లెలో నాయకులతో కలిసి రమేశ్ గురువారం ఆవిష్కరించారు. అనంతరం పేరబోయిన చేరాలు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో రమేశ్ మాట్లాడారు. ఓంకార్ నిత్యం ప్రజల్లో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేశారని చెప్పారు. రెండు దశాబ్దాలకుపైగా ఎమ్మెల్యేగా పని చేసిన ఓంకార్ చట్టసభల్లో నిత్యం ప్రజాసమస్యలు లేవనెత్తడమే పనిగా పాటుపడ్డారని గుర్తు చేశారు. రాజకీయాలకు వన్నె తెచ్చారని కొనియాడారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న రమేశ్, నాయకులు

వేలాది ఎకరాల భూమిని పేదలకు పంచారని తెలిపారు. మే 12న మచ్చాపూర్‌లోని ఓంకార్ స్తూపం వద్ద ప్రారంభ సభ నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు కుసుంబ బాబురావు, డివిజన్ కార్యదర్శి మహ్మద్ రాజా సాహెబ్, మాజీ సర్పంచ్‌లు హుస్సేన్, గీసపాక కొమురయ్య, నాయకులు పేరబోయిన అయిలయ్య, కోటేశ్వర్, సిరిబొమ్మల భాస్కర్, లాల్ మహ్మద్, సుధాకర్, లాసాని బాబురావు, పకిడె చందర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

## ముంజలు.. భలే మజా



ముంజలతో భలే మజా.. అంటూ పాదచారులు, బాటసారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మండుతున్న ఎండల నేపథ్యంలో పాదచారులు, బాటసారులు రోడ్ల పక్కన గీత కార్మిక కుటుంబాలు విక్రయిస్తున్న ముంజలను ఇష్టపడుతున్నారు. గీత కార్మిక కుటుంబాలకు ముంజలు ఉపాధి కల్పిస్తుండగా పలువురు ప్రయాణికులు, పాదచారులు ముంజలను ఆస్వాదిస్తూ ఆనంద పరవశులవుతున్నారు.

\- నర్సంపేట

## పరామర్శ

పర్వతగిరి : మండలంలోని బూర్గుమళ్లకు చెందిన దెంచినాల చంద్రమౌళి ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాన్ని వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ ఏడుదొడ్ల జితేందర్‌రెడ్డి ఆదివారం పరామర్శించారు. తొలుత చంద్రమౌళి చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబీకులతో మాట్లాడారు. చంద్రమౌళి మృతి పట్ల సంతాపం తెలిపారు.

# కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న వైస్ చైర్మన్ హరిబాబు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి

● మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ హరిబాబు

ఖానాపురం : ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే పంట ఉత్పత్తులకు మద్దతు ధర లభిస్తుందని వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శాఖమూరి హరిబాబు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. మండలంలోని ధర్మరావుపేటలో గణపతి రైతు పొదుపు సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ఆదివారం వారు ప్రారంభించి మాట్లాడారు. సన్నాలపై ప్రభుత్వం బోనస్ అందజేస్తోందని తెలిపారు. రైతులు దళారులను ఆశ్రయించొద్దని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి ప్రభుత్వం కల్పిస్తున్న ప్రయోజనాలు పొందాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు విజాకర్‌రావు, శ్రీనివాస్, రవి, రాజు, చాంద్ పాషా, రాజా సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

# వయోవృద్ధుల సంక్షేమమే ధ్యేయం

● సంఘం మండల అధ్యక్షుడు మల్లయ్య

నెక్కొండ : వయోవృద్ధుల సంక్షేమమే విశ్రాంత ఉద్యోగుల సంఘం ధ్యేయమని మండల అధ్యక్షుడు గటిక మల్లయ్య తెలిపారు. మండల కేంద్రంలో నిర్మించిన సీనియర్ సిటిజన్స్, పెన్షనర్స్ భవనాన్ని ఆదివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. వృద్ధాప్యంలో ఉద్యోగులు సైతం ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. విశ్రాంత ఉద్యోగుల, సీనియర్ సిటిజన్ల సమస్యలను ప్రభుత్వ, అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడానికి సంఘం కృషి చేస్తోందని తెలిపారు. విశ్రాంత ఉద్యోగులు యువతకు మార్గదర్శకంగా నిలవాలని కోరారు. అనంతరం భవన నిర్మాణానికి కృషి చేసిన పలువురిని సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.



సమావేశంలో మాట్లాడుతున్న మల్లయ్య

కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కౌన్సిలర్ ఇనుగాల ఉపేందర్‌రెడ్డి, వడ్డె లక్ష్మీనారాయణ, జిల్లా కార్యదర్శి చిదురాల సత్యనారాయణ, కుడికాల సోమశేఖరం, తదితరులు పాల్గొన్నారు.

# రాజ్యాంగ పరిరక్షణకు కృషి చేయాలి

● పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

ఆత్మకూరు : రాజ్యాంగ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం రాత్రి మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జైబాపు.. జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమం జరిగింది. కొత్త బస్టాండ్ నుంచి పోచమ్మ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. పహల్గాం ఉగ్రదాడికి నిరసనగా నాయకులు మౌనం పాటించారు. శివాజీ విగ్రహానికి పూలమాల వేశారు. అనంతరం జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన హక్కులతోనే అన్ని వర్గాలు అభివృద్ధి పథంలో నడుస్తున్నాయన్నారు. దేశ సమగ్రతకు రాజ్యాంగం తోడ్పడుతుందన్నారు. బీజేపీ ప్రభుత్వం ఆర్ఎస్ఎస్ సూచనల మేరకు హిందువులు మాత్రమే భారతీయులు అని చెప్పడం దారుణమన్నారు. బీజేపీ పెద్దలు రాజ్యాంగాన్ని గౌరవించడం లేదన్నారు. రాబోయే రోజుల్లో ఇతర మతాల వారు



శివాజీ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే

దేశంలో ఉండొద్దు అని కూడా ప్రకటిస్తారన్నారు.కార్యక్రమంలో జై బాపు జై భీమ్ జై సంవిధాన్ నియోజకవర్గ కోఆర్డినేటర్ కూచన రవళి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కమలాపురం రమేష్, మండల కో ఆర్డినేటర్ రామకృష్ణ జిల్లా నాయకులు బీరం సుధాకర్‌రెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్లు వాసు, మాజీ సర్పంచ్ రాజు, కుమారస్వామి, యూత్ అధ్యక్షుడు సందీప్, జైపాల్ రెడ్డి, వెంకటేశ్వర్లు, ఖాజా, శివారెడ్డి, అలువాల రవి, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

# 'కాషాయ జెండా ఎగరడం ఖాయం'

ఖిలా వరంగల్ : రానున్న రోజుల్లో తూర్పు నియోజకవర్గంపై కాషాయ జెండా ఎగరడం ఖాయమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కుసుమ సతీష్, మండల అధ్యక్షుడు బొరిగం నాగరాజు ధీమా వ్యక్తం చేశారు. వరంగల్ కరీమాబాద్‌లో ఆదివారం జరిగిన పార్టీ మండల కమిటీ సమావేశంలో వారు మాట్లాడారు. బూత్‌స్థాయి నుంచే పార్టీని బలోపేతం చేయాలని, అందుకు ప్రతీ కార్యకర్త సమష్టిగా కృషి చేయాలని సూచించారు. మండల కమిటీని పటిష్టంగా నిర్మించుకున్నామని, స్థానిక సమస్యలపై పార్టీ శ్రేణులు వెంటనే స్పందించి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. రానున్న రోజుల్లో వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగరటం ఖాయమైందని ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో నాయకులు మంద శ్రీను, కర్నే రవీందర్, బైరి నాగరాజు, మాదాసు రాజు, కపిల్, రాజేందర్, దీన్‌దయాళ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బధిరుల పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

హన్మకొండ కల్చరల్ : హనుమకొండ ఎన్‌జీటీ ప్రగతినగర్ కాలనీఫేస్-2లో తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీవేంకటేశ్వర బధిరుల ఉన్నత పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామని పాఠశాల ప్రిన్సిపాల్ జె.లక్ష్మీనర్సమ్మ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 28 నుంచి జూన్ 21 వరకు దరఖాస్తులు చేసుకోవాలని, ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి చదువుతున్న విద్యార్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని, ప్రవేశం పొందిన వారికి ఉచితంగా హాస్టల్ వసతి, ఒకటో తరగతి నుంచి 10వ తరగతి వరకు ఉచితంగా బోధన ఉంటుందని తెలిపారు. తప్పనిసరిగా వికలాంగుల సదరం గుర్తింపు కార్డు, ఆధార్‌కార్డు, యూడీఐడీ కార్డు, కులం, ఆదాయం సర్టిఫికెట్, రేషన్‌కార్డు, నాలుగు పాస్‌ఫొటోలు పాఠశాల కార్యాలయంలో అందజేయాలని వివరించారు.

# జోరుగా.. హుషారుగా..

సాక్షి నెట్‌వర్క్ : హనుమకొండ జిల్లా పరిధిలోని ఎల్కతుర్తిలో ఆదివారం నిర్వహించిన బీఆర్ఎస్ రజతోత్సవ సభకు జిల్లాలోని అన్ని మండలాల నుంచి ఆ పార్టీ శ్రేణులు, జనం జోరుగా.. హుషారుగా తరలివెళ్లారు. నర్సంపేట, నెక్కొండ, దుగ్గొండి, ఖానాపురం, నల్లబెల్లి, వర్ధన్నపేట, రాయపర్తి, పర్వతగిరి, సంగెం, గీసుకొండ, తదితర మండలాల నుంచి బస్సుల్లో వేలాదిగా బయల్దేరారు. వర్ధన్నపేట మండలంలోని కట్ర్యాల నుంచి మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ట్రాక్టర్ నడుపుతూ సభకు బయల్దేరారు. అలాగే ఆయా మండలాల్లో పార్టీ మండల అధ్యక్షులు జెండా ఊపి వాహనాల ర్యాలీలను ప్రారంభించారు. పదుల సంఖ్యలో ఆర్టీసీ, ప్రైవేట్ బస్సులు, కార్లు, ట్రాక్టర్లలో భారీ సంఖ్యలో సభకు వెళ్లడం కనిపించింది.



వర్ధన్నపేట : కట్ర్యాలలో ట్రాక్టర్‌లో సభకు బయల్దేరిన మాజీ మంత్రి దయాకర్‌రావు, నాయకులు



నర్సంపేట : సభకు బయల్దేరుతున్న శ్రేణులు



నెక్కొండ : ర్యాలీని ప్రారంభిస్తున్న నాయకులు



పర్వతగిరిలో..



నర్సంపేట : రోడ్డు పక్కన భోజనం చేస్తున్న ఇల్లెందు నియోజకవర్గ శ్రేణులు



నర్సంపేట రూరల్ : ముత్తోజిపేట నుంచి తరలుతున్న నాయకులు, కార్యకర్తలు



నల్లబెల్లి : రజతోత్సవ సభకు బయల్దేరుతున్న బీఆర్ఎస్ శ్రేణులు

# కొవ్వొత్తులతో శాంతిర్యాలీ



నల్లబెల్లి : పహల్గాం ఘటనలో మృతి చెందిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని కాంక్షిస్తూ మండల కేంద్రంలోని సీఎస్ఐ చర్చి నుంచి బస్టాండ్ వరకు క్రైస్తవులు ఆదివారం కొవ్వొత్తులతో శాంతిర్యాలీ నిర్వహించారు. ఉగ్రవాదులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పాస్టర్ ఈపీ.ప్రసాద్ మాట్లాడారు. ఉగ్రదాడిని కులమతాలకు అతీతంగా ప్రజలందరూ ముక్తకంఠంతో ఖండించాలని కోరారు. బాధిత కుటుంబాలను కేంద్ర ప్రభుత్వం ఆదుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నాగెల్లి ప్రకాశ్, జన్ను జయరావు, కొండి అశోక్, కనకం మహేందర్, కొయల కన్నయ్య, నాగెల్లి పావని, మనుగొండ శ్రీలత, భారతి తదితరులు పాల్గొన్నారు.


సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

వరంగల్ రూరల్ : 9951602875 9553955722

Office mail : wglsakshiadvt@gmail.com



సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.

డి. రాజు యాదవ్ (S.R) : 9502950309 (వర్ధన్నపేట)
కె. రమేష్ (S.R) : 9441304664 (నర్సంపేట)
పి.చంద్రశేఖర్ (A.C.O) : 9963646944